సాక్షి
తిరుపతి
సోమవారం । 6 । మే । 2024



## అలరించిన భరతనాట్యం

చంద్రగిరి(తిరుచానూరు) : శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన సభికులను రంజింపజేసింది.



## 12న రామానుజ జయంతి

రాపూరు : పెంచలకోనలో ఈనెల 12న రామానుజ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## కారు బోల్తా

చిట్టమూరు మండలంలోని కొత్తగుంట వద్ద ఓ కారు ఆదివారం అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది.



- 8లో

## న్యూస్‌రీల్

### శ్రీవారి దర్శనానికి 12 గంటలు



**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,848 మంది స్వామివారిని దర్శించుకోగా 39,317 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

### నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

**తిరుపతి సిటీ:** శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సనాతన ధర్మ సంస్కృతి సంప్రదాయ పరిరక్షణలో భాగంగా వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు వర్సిటీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులు సోమవరాం నుంచి మే 27 వరకు రోజూ ఉదయం 8 నుంచి 10.30గంటల వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 ఏళ్లలోపు బాలబాలికలకు వివిధ దేవత సంబంధమైన ధ్యాన శ్లోకాలు, విష్ణు సహస్రనామ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తర శతకంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 16 ఏళ్లు పైబడిన విద్యార్థినీ, విద్యార్థులకు లలితా సహస్రనామ స్తోత్రం, వివిధ దేవతా స్తోత్రాలు, వ్రతాలు, నవవిధభక్తి మార్గాల పట్ల అవగాహన, సనాతన ధర్మం పట్ల అవగాహన, వేదాలకు సంబంధించి స్వశాఖాపరమైన సంధ్యావందనం నేర్పనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు అడ్మిషన్ల కొరకు 9550071629, 9000850325 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

### ప్రశాంతంగా నీట్

- తిరుపతిలో 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- 97.37 శాతం మంది హాజరు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం తిరుపతిలోని 9 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన నీట్ అర్హత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నీట్ పరీక్షను ఎన్‌టీఏ ఆఫ్‌లైన్ విధానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. తిరుపతిలోని విశ్వం హైస్కూల్, ఎడిఫై, శ్రీవిద్యానికేతన్ ఇంటర్నేషనల్ స్కూల్, గీతమ్, లిటిల్ ఏంజల్స్, శ్లోకా బిర్లా, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, మార్గ్ చిన్మయ విద్యాలయా సీనియర్ సెకండరీ స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షను నిర్వహించారు. నీట్ రాసేందుకు ఉదయం 11గంటల నుంచే విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వీరిని నిబంధనలకు అనుగుణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. తిరుపతిలోని 9 పరీక్షా కేంద్రాల్లో 4,692 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా.. వీరిలో 105 మంది గైర్హాజరు కావడంతో 4,569(97.37శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారు.

## గుడ్‌మార్నింగ్!




ఓజిలిలో నాడు-నేడుతో సుందరంగా తీర్చిదిద్దిన ఆస్పత్రి భవనం

# ఇదిగో సాక్ష్యాలు.. నవరత్న ఆనవాళ్లు

- ప్రగతి పథంలో దూసుకుపోతున్న గ్రామాలు
- పరుగులు పెడుతున్న అభివృద్ధి పనులు
- వెల్లివిరుస్తున్న ప్రభుత్వ భవనాలు
- నాడు–నేడుతో సమూలంగా మారిన సర్కారు బడులు
- ఇళ్లు కాదు.. ఊళ్లుగా వెలిసిన జగనన్న కాలనీలు
- అబ్బో..! ఎటు చూసినా నయా మెరుగులే!

**సూళ్లూరుపేట :** సాక్షి బృందం విలేజ్ విజిట్ పేరుతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో అటు అడుగుపెట్టగానే.. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మది నుంచి పుట్టుకొచ్చి సాక్షాత్కరించిన అభివృద్ధి పనులన్నీ టక్కున లేచి గుడ్‌మార్నింగ్ అంటూ విష్ చేశాయి. గ్రామాల్లో వెలిసిన ప్రభుత్వ భవనాలు.. పట్టణాల్లో రూపుదిద్దుకున్న పార్కులు.. గ్రామాలకు ఏర్పాటైన రోడ్లు.. రైతులకు అందుబాటులోకి వచ్చిన అగ్రిల్యాబ్‌లు.. రైతు భరోసా కేంద్రాలు ముందు నాగురించే రాయండి అంటూ చెతులెత్తడం ప్రారంభించాయి. ముందుగా ఓజిలి మండలానికి వెళ్లగా అక్కడ 'అందరికీ ఆరోగ్యం పంచేది నేనే కదా' అంటూ 'నాడు–నేడు' పథకంలో రూ.1.2 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం లేచి నిలబడి నా గురించంటే నాగురించి ముందు రాయమని కూర్చినింది. అక్కడి నుంచి పెళ్లకూరు మండలంలోని పాలచ్చూరుకు వెళ్లగా.. అక్కడ 'రైతులంటే గుర్తొచ్చేది సాగునీరే కదా'.. అంటూ.. రూ.38 కోట్లతో నిర్మించిన పాలచ్చూరు సప్లయ్ చానెల్ చేయి పైకి లేపింది. తరువాత నాయుడుపేట పట్టణంలోకి అడుగుపెట్టగానే 'ఆహ్లాదానికి మారుపేరు నేను కాదంటారా..?' అంటూ లేచి నిలబడింది.. రూ.1.5 లక్షలతో నిర్మించిన మున్సిపల్ పార్కు. అక్కడి నుంచి దొరవారిసత్రం మండలం, నెలబల్లి గ్రామానికెళ్లగా.. 'ప్రగతి అంటే ఇదే కదా' .. కావాలంటే వచ్చి చూడండి.. లేకుంటే అభివృద్ధి గురించి మీరు రాయనట్టే నంటూ సవాల్ విసిరాయి అక్కడ ఒకే సముదాయంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు. ఆ తర్వాత సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరులో పర్యటించగా.. అక్కడ 'ఇళ్లుకాదు.. ఊళ్లు వెలిశాయి చూడండి' అంటూ.. జగనన్న కాలనీ చెప్పుకొచ్చింది. తరువాత సూళ్లూరుపేట రూరల్ ప్రాంతంలోని ఇలుపూరు వద్ద కెళ్లగా 'ప్రగతికి రహదారి ఇదే కదా' కావాలంటే చూసి వెళ్లండని రూ.6 కోట్లతో నిర్మించిన సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డు ఉప్పొంగిపోయింది. ఆఖరుగా తడ మండలం, కొండూరు పంచాయతీ పులివేంద్రంలో పర్యటించగా.. 'రైతుకు ఎలాంటి మేలుచేయొచ్చో దీనిద్వారా తెలియజేయచ్చు' అంటూ.. రూ.1.16 కోట్లతో నిర్మించిన అగ్రిల్యాబ్ భవనం చేయి ఊపింది..' ఇలా రాసుకుంటూ పోతే.. ఏటిని ఎంచుకోవాలి.. ఎవరికి గురించి రాయాలి! 'మళ్లీ వస్తాం..ప్రగతిని పదుగురికీ పంచుతాం' అంటూ అక్కడి నుంచి సాక్షి బృందం నిష్క్రమించింది..!

### రూపురేఖలు మారాయి



గత 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాడు–నేడు పథకం ద్వారా రూ.1.2 కోట్లతో ఆస్పత్రిభవనాన్ని సమూలంగా మార్చేసింది. ఇప్పుడు విశాలమైన గదులు నిర్మించడంతో పాటు మండల ప్రజలకు ఇబ్బందుల్లేకుండా వైద్య సేవలను అందిస్తోంది. మందులు అందుబాటులో ఉన్నాయి. నాడు–నేడులో ఆస్పత్రి బాగుపడింది. ప్రజల మంచి కోరి పని చేసిన వారిని మరొక్కమారు ఎన్నుకుంటే బాగుంటుందనుకుంటున్నాను. మాట మీద నిలబడే వారికి మా మద్దతు ఉంటుంది. – ఎస్.రమణయ్య, ఓజిలి

### పాలచ్చూరు చానెల్‌కు మోక్షం



రూ.36 కోట్లతో పాలచ్చూరు సాగునీటి కాలువను అభివృద్ధి చేశారు. పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండలాల్లోని 18 చెరువులకు సాగునీరు అందించారు. దీంతో ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకొనే అవకాశం లభించింది. గత ప్రభుత్వం ఇక్కడి వ్యవసాయ కాలువలు, చెరువుల అభివృద్ధిపై దృష్టి పెట్టలేదు. వర్షాధారంతో ఎల్లి పైర్లు పెట్టుకొనేవాళ్లం. ఇప్పుడు సాగునీటి కాలువ అభివృద్ధితో పుష్కలంగా సాగునీరు చెరువులకు చేరుతోంది. నాడు ప్రజాసంకల్ప యాత్రలో మాట ఇచ్చినట్టే సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఈ కాలువను అభివృద్ధి చేయించారు. ఈ ఎన్నికల్లో మాట ఇస్తే మరచిపోకుడా పనిచేసే వారికి మద్దతు తెలియజేయాలనుకుంటున్నాం.

– మునికృష్ణయ్య, రైతు పాలచ్చూరు గ్రామం



పెళ్లకూరు మండలం, పాలచ్చూర సప్లయ్ చానల్ పునర్నిర్మాణం

### పెల్లెటూర్లో పట్నమొచ్చినట్టుంది



దొరవారిసత్రం మండలం, నెలబల్లి గ్రామంలో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, ఆర్బీకే భవనాలు



మా గ్రామం జాతీయ రహదారి పక్కనే ఉంది. ఇక్కడ ఒకే చోట గ్రామ సచివాలయ భవనం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం వంటి భవనాలు నిర్మించారు. దీంతో నెలబల్లి ప్రాంతం ఓ చిన్న పట్టణ తరహాలో రూపుదిద్దుకుంది. గతంలోకంటే ఇప్పుడు మా ఊర్లో ఎంతో మార్పు వచ్చింది. ఒకే ప్రాంతంలో అన్ని ప్రభుత్వ భవనాలు ఏర్పడడంతో రోడ్డు పక్కనే టిఫిన్ అంగళ్లు, కూల్‌డ్రింక్ షాపులు, టీ సెంటర్లు వెలిశాయి. ఇప్పుడు ఇక్కడ చిన్న టౌన్ తరహాలో కనిపిస్తోంది. ఈ సారి మాట మీద నిలబడే నాయకుడ్ని ఎన్నుకుంటాము.– నల్లారెడ్డి రాజేష్, నెలబల్లి గ్రామం, దొరవారిసత్రం

### ప్రజారోగ్యం..మరింత ఆహ్లాదకరం



నాయుడుపేట పట్టణం నడిబొడ్డున ఆక్రమణలతో దుర్గాంధ భరితంగా ఉండే పడమటి వీధిని గాంధీపార్కుగా తీర్చిదిద్దారు. రూ.1.5 కోట్లతో అధునాతనంగా మార్చేశారు. దీనివల్ల పట్టణ ప్రజలకే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల చిన్న పిల్లలు మొదలుకొని మహిళలు, యువత, వృద్ధులు అందరికీ ఆహ్లాదం కలిగిస్తోంది. మాట ఇస్తే మరిచిపోకుడా పనులు చేసిపెట్టే వారు మనల్ని పాలిస్తే అందరూ హాయిగా ఉంటారని రుజువు చేశారు. – గంధవల్లి ప్రవల్లిక, నాయుడుపేట పట్టణం



నాయుడుపేట పట్టణంలో ఆహ్లాదాన్ని పంచుతున్న మున్సిపల్ పార్క్

### 10 గ్రామాలకు మేలు



సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డు డబుల్ రోడ్డుగా విస్తరించడం వల్ల ప్రయాణం సులువుగా ఉంది. గత ప్రభుత్వంలో ఈ రోడ్డు సింగిల్ రోడ్డుగా ఉండేది. ఈ మార్గంలో సూళ్లూరుపేట మండలంలోని సుమారు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన వెంటనే ముందుగా ఇచ్చిన మాట ప్రకారం దీన్ని డబుల్‌రోడ్డుగా విస్తరించారు. ఇలాంటి మంచి పనులు చేసిన వారు ప్రజాప్రతినిధులుగా ఉంటే ప్రజలకు మంచి జరుగుతుందని రుజువు చేశారు. అందుకే మంచి చేసే వారినే ఎన్నుకుంటాము.

– పుల్లూరు అంకమ్మ, మన్నారు పోలూరు



సూళ్లూరుపేట–శ్రీకాళహస్తి రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించిన దృశ్యం



సూళ్లూరుపేట మున్సిపాలిటీ మన్నారుపోలూరు వద్ద జగనన్న కాలనీ

### కల నెరవేరింది



కావలికి చెందిన మేము పొట్టచేతబట్టుకుని సూళ్లూరుపేట పట్టణంలో బాడుగ ఇంట్లో ఉండేవాళ్లం. నా భర్త ఆపాచీ కంపెనీలో చిన్నపాటి ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇల్లు లేకపోవడంతో జీతంలో సగం ఇంటి బాడుగకే సరిపోయేది. గత ప్రభుత్వంలో ఎన్నోమార్లు సొంతిల్లు, ఇంటి స్థలం కోసం అర్జీలు ఇచ్చిఇచ్చి అలసిపోయాం. ఈ ప్రభుత్వం రావడమే తరువాయి.. ఒకటిన్నరసెంటు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇల్లు కట్టుకుని ఇక్కడే నివాసముంటున్నాం. మా బిడ్డలకు అమ్మ ఒడి, మా అత్తమ్మకు పింఛన్, నాకు జగనన్న ఆసరా, సున్నా వడ్డీ పథకాలు వస్తున్నాయి. మా కుటుంబానికి ఇంత మంచి చేసిన మనిషికే మా మద్దతు. – బండి ఉషారాణి, మన్నారుపోలూరు జగనన్న కాలనీ

### అగ్రి ల్యాబ్ ఎంతో ప్రయోజనం



తడ మండలం, పులివేంద్రంలోని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో రూ.1.16 కోట్లతో రైతులకు మరింత సేవలందించేందుకు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ అగ్రి ల్యాబ్ ఏర్పాటు చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే సేవల్లో మరింత నాణ్యత ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. అగ్రి ల్యాబ్ నెలకొల్పడం వల్ల రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతోంది. భూసార పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పోవాల్సిన అవసరం లేదు. ఇలాంటి మంచి పనులు చేసే వారిని ఎన్నుకుంటాము.

– పర్వతరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పులివేంద్రం, తడ మండలం



తడ మండలం, పులివేంద్రంలో నూతనంగా నిర్మించి అగ్రి ల్యాబ్ భవనం

# ల్యాండ్ టైటిల్ యాక్ట్ తెచ్చిందే కేంద్రం

- అవ్వాతాతల గోష్ట చంద్రబాబు, పవన్‌కు తగులుతుంది
- ఆరణి శ్రీనివాసులు మెదడు కోడిపుంజు మెదడు
- కూటమికి ప్రజామద్దతు లేకే కార్పొరేటర్లకు వల
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే భూమన, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి ధ్వజం





తిరుపతి కొర్లగుంటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి(ఇన్‌సెట్) ఓటరుకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఎమ్మెల్యే భూమన

**తిరుపతి మంగళం :** కోతికి కొబ్బరి చిప్ప దొరికినట్టు ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు పట్టుకుని ఆ యాక్ట్ వస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల భూములను లాక్కుంటారంటూ విషప్రచారం సృష్టిస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. ఆ యాక్ట్ తెచ్చిందే కేంద్ర ప్రభుత్వం, ఎన్డీయే కూటమి అన్న విషయాన్ని పక్కనబెట్టి వారు చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి ఎంతసేపు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ జగనన్నపైన బురదజల్లేందుకు ప్రయతిస్తున్నారని ధ్వజమెత్తారు. తిరుపతి 4, 5 డివిజన్లలో ఆదివారం కార్పొరేటర్ పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యురాలు రుద్రరాజు శ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీ మద్దిల గురుమూర్తి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ రాజకీయ పరిణతిలేని వ్యక్తి సభ్యసమాజం తలదించుకునేలా, ఓ బజారు మనిషిలాగ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై నోరుపారేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజకీయమంటే డైలాగులు, బూతులు మాట్లాడే సినిమా కాదని హెచ్చరించారు. ఇంటి వద్ద అవ్వాతాతలకు పింఛన్లు అందకుండా చేసిన దుర్మార్గులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అని మండిపడ్డారు. తిరుపతిలో కోడిపుంజు మెదడంత మెదడు ఉన్న కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు చిత్తూరును ఏలి దోచుకున్నది చాలక తిరుపతిని దోచుకోవడానికి వచ్చారని ఆరోపించారు. ప్రజలకు ఏమి చేస్తారో చెప్పి ఓట్లు అడగాల్సిన ఆరణి .. ఎంతసేపు తమపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. అనంతరం ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ ఎలాగైన అధికారంలోకి రావాలన్న దురాలోచనతో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను భూతద్దంలో చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రవేశపెట్టిని మేనిఫెస్టోను దేశ ప్రధాని నరేంద్రమోదీనే అంగీకరించలేదన్నారు. తిరుపతిలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా అభివృద్ధి జరిగిందంటే అది కేవలం అభినయ్ వల్లేనన్నారు. జగనన్న అందించిన సంక్షేమం, తిరుపతిలో తాము చేసిన అభివృద్ధిని చూసి ఎమ్మెల్యేగా అభినయ్‌కి, ఎంపీగా తనకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**తిరుపతి అర్బన్ :** జిల్లాలో తొలిరోజు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం పలు ఫెసిలిటేషన్ కేంద్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తనిఖీ చేశారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను, ఓటింగ్ సరళిని ఆయన ఆదివారం అధికారులతో కలసి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫెసిలిటేషన్ సెంటర్లలో ఈనెల 7, 8 తేదీలో కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పీఓలు, ఏపీఓలు, అబ్జర్వర్లు, అత్యవసరశాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో మొత్తం 22,299 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా అందులో 12.310 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్టు కలెక్టర్ తెలిపారు.



తిరుపతిలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



తిరుపతిలోని ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద బారులు తీరిన ఉద్యోగులు

## క్లుప్తంగా

### ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

**–డ్రైవర్ మృతి**



సురేష్ (ఫైల్)

**పాకాల :** ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుంచి మరో లారీ ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని శంఖంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం.. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై సూళ్లూరుపేట నుంచి చెప్పుల లోడుతో మైసూర్‌కి వెళుతున్న లారీ శంఖంపల్లి వద్ద ఆగి ఉన్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో వెనుక నుంచి గుద్దిన లారీ డ్రైవర్ వీ.సురేష్(49) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా.. మార్గ మధ్యంలోనే మృతిచెందాడు. మృతుడు తమిళనాడు రాష్ట్రం, వేలూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పాకాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియ పరిశీలన

**తిరుపతి సిటీ:** ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ స్ట్రాంగ్ రూమ్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్ సమక్షంలో జరుగుతున్న అసెంబ్లీ నియోజకవర్గ ఈవీఎం కమిషనింగ్‌ను ఆదివారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గంలోని 274 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంల బ్యాలెట్ యూనిట్‌కి ఎన్నికల బ్యాలెట్ పేపర్ సెట్ చేసేందుకు 40 టేబుళ్లను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల సమక్షంలో భెల్ ఇంజినీర్లు, సిబ్బంది కలిసి కమిషనింగ్ ప్రక్రియ కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### అదుపుతప్పి కారు బోల్తా

**చిట్టమూరు(చిల్లకూరు) :** చిట్టమూరు మండలంలోని కొత్తగుంట వద్ద ఆదివారం అతివేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతికి చెందిన యువకులు ఆదివారం వాకాడు మండలం తూపిలిపాళెం బీచ్‌కు కారులో వచ్చారు. తిరిగి తిరుపతి వెళుతూ చిట్టమూరు మండలం కొత్తగుంట వద్ద కారు అదుపుతప్పి బోల్తాపడింది.

అధికార మదం..

# ఆ ఐదేళ్లూ కురుగొండ్లకు వరం!

అధికార మదంతో పేట్రేగిపోయాడు. ప్రజాప్రయోజనాలకు ఖర్చుచేయాల్సిన నిధులన్నీ తన అనుచరులకు అడ్డంగా దోచిపెట్టాడు. ఇది చాలదన్నట్టు చేనేతల కోసం కేటాయించిన స్థలాన్ని లాగేసుకున్నాడు. అంతే ఆ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని ప్రారంభించి అధికారులకు సవాల్ విసిరాడు. అంతటితో ఆగక భవనాన్ని మరింత విస్తరించి రోడ్డుకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్నీ మింగేశాడు. ఆయన అక్రమదందాకు ఎవరడ్డుతగిలినా ఇక అంతే.. అధికార మదంతో కన్నూమిన్ను కానరాకుండా రెచ్చిపోయిన అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల అవినీతి, అక్రమాలపై స్పెషల్ ఫోకస్..

- 2014 నుంచి 2019 వరకు విచ్చలవిడిగా దోపిడీ
- చేనేతల స్థలం కబ్జా
- ఆ స్థలంలో భార్య పేరిట అక్రమ నిర్మాణం
- ఇరిగేషన్‌శాఖలో భారీగా అక్రమాలు
- ఇలాంటి నేతకు మళ్లీ టిక్కెట్ ఇవ్వడంపై స్థానికుల విస్మయం



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణ భార్య పేరుతో అనుమతులు లేకుండా నిర్మించిన భవనం(ఇన్‌సెట్) కురుగొండ్ల

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** వెంకటగిరిలో 2014 నుంచి 2019 వరకు అప్పటి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దోపిడీ పర్వానికి తెరలేపారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేయడం ప్రారంభించారు. ఆయన ఆదేశాల మేరకే పచ్చా చొక్కా నేతలు కూడా చెలరేగిపోయారు. ప్రజాసేవ చేయాలనే ఆలోచకు నీళ్లొదిలేసి.. పదవీకాంక్ష, డబ్బు సంపాదించాలనే వాంఛతోనే రాజకీయాలు చేశారు. అధికారం మనదే.. ఏమైనా చేసేస్తాం.. ఎంతైనా మింగేస్తాం.. అన్నట్టు వారి ఆగడాలు సాగినట్టు వెంకటగిరి ప్రజలు చెబుతున్నారు.

**అక్రమ రిజిస్ట్రేషన్‌తో చేనేతల స్థలం కైవశం**

రామకృష్ణ అక్రమరవాణా వ్యవహారంలోనే కాకుండా పేదలకు చెందిన స్థలాన్ని కూడా వదల్లేదు. వెంకటగిరి పట్టణంలోని ఉపాధ్యానగర్ సమీపంలో 14,544 చదరపు అడుగులు చేనేత సొసైటీకి కేటాయించిన స్థలాన్ని ఆయన తన భార్య సింధు పేరుతో అప్పటి సొసైటీ అధ్యక్షుడు నీలా సుబ్బరాయులు చేత చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ వ్యవహారంపై వెంకటగిరి పట్టణానికి చెందిన చోప్పా వెంకటేశ్వర్లు అనే చేనేత కార్మికుడు లోకాయుక్తను ఆశ్రయించారు. దీంతో ఆ స్థలంలో అక్రమ నిర్మానాలను నిలుపదల చేయాలని ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలను అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆ ప్రాంతంలో ఎంచక్కా రాజప్రసాదం వెలిసింది. ఎమ్మెల్యే కే.రామకృష్ణ కైవసం చేసుకున్న స్థలం చిన్నపిల్లల పార్కుకు కేటాయించినట్టు చేనేత కార్మికలు చెబుతున్నారు. అంతేగాక రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత తన ఇంటిని మరింత విస్తరించారు. రోడ్డుకు కేటాయించిన స్థలాన్ని సైతం ఆక్రమించేశారు. అంతేగాక ఆ స్థలాన్ని మార్కెట్ విలువ మేరకు తనకు కేటాయించాలని ప్రభుత్వానికి తరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఆక్రమణలో ఉన్న స్థలాన్ని మార్కెట్ విలువ మేరకు ఆయన సతీమణి సింధుకు అప్పగించేందుకు తమకేమీ అభ్యంతరం లేదని అప్పటి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది.

**నిబంధనలకు నీళ్లొదిలి.. అవినీతిని మరింత విస్తరించి**

అప్పట్లో దోచుకుని దాచుకోవాలనే ఫార్ములాను అధికారంలోకి వచ్చిన రెండో ఏట నుంచే తెలుగు తమ్ముళ్లు తెరపైకి తెచ్చారు. ఇందులో భాగంగా రైతుల స్థితిగతులు మెరుగుపరిచేందుకు ఇరిగేషన్ శాఖకు మంజూరైన రూ.100 కోట్లు కొరుగుండ్ల అనుచరులు అప్పనంగా భోంచేశారు. ఈ నిధులతో నామమాత్రంగా చెక్‌డ్యామ్‌లు, తూములు, సప్లైయ్ చానళ్లు తదితర వాటిని నిర్మించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ పనులు చేపట్టారు. అవసరం లేని చోట చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో ఎవరికీ ప్రయోజనం లేకపోయింది. నాసిరక నిర్మాణాలతో కేవలం కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే ఈ నిధులు సరిపోయాయని అప్పట్లో పెద్ద చర్చ సాగింది. ఇదంతా అప్పటి ఎమ్మెల్యే కొరుగుండ్ల కనుసన్నల్లోనే సాగడం గమనార్హం.

**నీరు–చెట్టు..కార్యకర్తలకు దోచిపెట్టు**

నీరు–చెట్టు పథకం పనుల్లో ఎక్కువ ప్రాథన్యత అప్పటి ఎమ్మెల్యే సొంతూరు అయిన పాతనాలపాడు, ఎంపీపీ స్వగ్రామం మాటుమడుగు, జెడ్పీటీసీ స్వగ్రామం దేవునివెల్లంపల్లి, ఎమ్మెల్యే అనుచరులుగా ఉన్న డక్కిలి, దేవులపల్లికి ఎక్కువ నిధులు వెచ్చించారు. ఆయా గ్రామాల్లో కోట్ల రూపాయల పనులు చేపట్టారు. కానీ ఇవేవీ ప్రజలకు ఉపయోగపడలేదు. కేవలం తమ బినామీలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే ఈ నిధులన్నీ ఖర్చుచేశారని అప్పట్లో ప్రజలు విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రస్తుతం ఇలాంటి వ్యక్తిని చంద్రబాబునాయుడు వెంకటగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# బూటకాల 'బాబు'



చిత్తూరులో వైఎస్సార్‌సీపీ నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, జెడ్పీ చైర్మన్

**చిత్తూరు కార్పొరేషన్ :** చంద్రబాబునాయుడు ఎప్పుడూ మాట మీద నిలబడరని, 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదని, మళ్లీ ఇప్పుడు కొత్తగా పక్క రాష్ట్రాల పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో విడుదల చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జగన్ అంటే నమ్మకమని, బాబు అంటే అబద్ధమని స్పష్టం చేశారు. గతంలో రైతు రుణమాఫీ, డ్వాక్రా సంఘాల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే తుంగలో తొక్కేశారని ఆరోపించారు. ఇప్పుడు మళ్లీ మోసపు వాగ్దానాలతో ప్రజల ముందుకు వస్తున్నారని, నమ్మితే మునిగిపోవడం తథ్యమని హెచ్చరించారు.

**వెనుకబడ్డ చిత్తూరు**

మాజీ ఎమ్మెల్యే సీకేబాబు వైఖరితో చిత్తూరు చాలా నష్టపోయిందన్నారు. ఆయన రౌడీయిజం కారణంగా చిత్తూరుకు రావాలంటే ఇతర ప్రాంతాలవారు భయపడ్డారని తెలిపారు. ఇతర జిల్లాలకు కార్పొరేట్ కంపెనీలు క్యూ కడుతుంటే చిత్తూరు మాత్రం వెనుకబడిందన్నారు.ఈ క్రమంలోనే ఆరణి శ్రీనివాసులును చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిపిస్తే విశ్వాసం లేకుండా జనసేనకి వెళ్లారని మండిపడ్డారు. ఇక్కడ భూములన్నీ కబ్జా చేసేసి, ఇప్పుడు తిరుపతిపై పడ్డారని ఆరోపించారు.

**కరోనా సమయంలో గురజాల ఎక్కడ?**

జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ కరోనా సమయంలో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. బీసీ నేత రావూరి ఈశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టి ఆ పార్టీ గెలుపునకు కారణమైతే అధికారంలో వచ్చాక మోసంచేశారని మండిపడ్డారు. రూ.300 కోట్లు విలువైన తన ఫ్యాక్టరీని నలుగురు నాయకులు కుట్రపన్ని మూయించారని ఆరోపించారు.

## రేపు, ఎల్లుండి కూడా పోస్టల్ బ్యాలెట్

**తిరుపతి తుడా:** పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు మరో రెండు రోజులు పొడిగించినట్లు తిరుపతి నియోజకవర్గం ఎన్నికల అధికారి అదితి సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండి జిల్లాలో ఓటు హక్కు కలిగి మే 1వ తేదీ నాటికి ఫారం–12 దరఖాస్తు చేసుకోలేకపోయిన వారికి నియోజకవర్గ ఫెసిలిటేషన్ సెంటర్‌లో 7, 8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ అవకాశం కల్పించారని ఆమె తెలిపారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నందు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుని, కొన్ని కారణాలతో తిరస్కరించబడిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తగిన ధ్రువ పత్రాలతో ఈ ఓటింగ్ సౌకర్యం వినియోగించుకోవాలని సూచించారు.

### శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారి ఆలయం ఎదుట డీఆర్డీఏ చైర్మన్

**తిరుమల:** తిరుమల శ్రీవారిని ఆదివారం డీఆర్డీఏ చైర్మన్ వెంకట్‌కామత్, ఏపీ మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

# వైఎస్సార్‌సీపీ జోష్



వెంకటగిరి: నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువత

**తిరుపతి రూరల్:** వైఎస్సార్‌సీపీ జోష్‌మీదుంది. ప్రచార పర్వాన్ని మరింత ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తిరుపతి రూరల్ మండలం, కుంట్రపాకం పంచాయతీలో టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు పెరిగాయి. మాజీ సర్పంచ్ బుజ్జిరెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీ, జనసేన నుంచి పెద్ద ఎత్తున యువత వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి తుమ్మలగుంట నివాసం వద్ద తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మునిచంద్ర, వెంకటముని, కుమార్, అనిల్, పవన్, మణి, బాబు, శ్రావణ్‌కుమార్, ఆనంద్‌బాబు, అభినయ్, విష్ణు, మధు, సునీల్, రవికుమార్, చిరంజీవి, యుగంధర్, పూర్ణ, వెంకీ, కిరణ్, వికాస్, సూర్యబాబు, శ్రీకాంత్, యశ్వంత్, విక్రమ్, దినేష్, చైతన్య, కృష్ణయ్యతో పాటు 40 మంది ఉన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుజ్జిరెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షులు అవినాష్‌రెడ్డి, సేవదళ్ అధ్యక్షులు భరత్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

**వెంకటగిరిలో భారీగా చేరికలు**

**సైదాపురం:** వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. తిప్పిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పుల్లయ్య, తుమ్మలతలుపూరు ఉపసర్పంచ్ బత్తలయరవి, వారి అనుచరులు ప్రతాప్, ఏ.వెంకటేశ్వర్లు, డీ.వెంకటయ్య, బీ.కోటేశ్వరరావు, బీ.శివశంకర్, ఎస్.చిరంజీవి, సాంబయ్య, లక్ష్మణ్‌సింగ్, టీ.నరసింహులు, బీ.వెంకటరమణయ్య, గుణ, తిప్పిరెడ్డిపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, హరికృష్ణ, నరసయ్య, మణి వైఎస్సార్‌సీపీలో చేరారు.



వెంకటగిరి : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వారికి వైఎస్సార్‌సీపీ వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలో 20 కుటుంబాలు చేరిక**

**వెంకటగిరిరూరల్:** పట్టణంలోని 6వ వార్డు కౌన్సిలర్, చేనేత విభాగం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాడా జానకీరామయ్య సారథ్యంలో 20 టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఆదివారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు వారికి స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి కండువాలు కప్పిపార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కలవలపూడి శేఖర్, బాబు, జాకీర్, మహేష్, మధు, పవన్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి రూరల్ : కుంట్రపాకంలో చేరిన యువతతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

### మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



వెంకటేశ్వర్లు (ఫైల్)

**ఏర్పేడు:** మండలంలోని జింకలమిట్టలో మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సీఐ అందించిన వివరాలు.. మండలంలోని మునిరత్నం నాయుడు కుమారుడు వెంకటేష్ అలియాస్ వెంకటేశ్వర్లు(37)కు మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో 2024 ఫిబ్రవరి 18న ఇంటి నుంచి వెళ్లాడు. ఇప్పటి వరకు కనబడకపోవడంతో తండ్రి మునిరత్నం నాయుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి వెంకటేశ్వర్లు వెళ్లేటప్పుడు ఎర్రటి టీషర్ట్, నల్లటి ప్యాంటు ధరించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440900729 ఫోన్ నంబరుకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

### రోబోటిక్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

**కడప కోటిరెడ్డి సర్కిల్ :** రాయలసీమలో మొట్టమొదటిసారిగా కడపలోని విద్యా సాగర్ హాస్పిటల్‌లో రోబోటిక్ టెక్నాలజీ ఉపయోగించి 100 మోకాలి కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం ఈ మేరకు ఆస్పత్రిలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యాసాగర్ ఆస్పత్రి అధినేత డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీని 2024లో రాయలసీమ లో మొదటిగా కడప నగరానికి తీసుకొచ్చినట్లు వివరించారు. ఊబకాయం ఉన్నవారు, ఎక్కువ మోకీలు అరుగుదల ఉన్నవారు, తక్కువ వయసులో మోకీలు మార్పిడి అవసరమైన వారు, మోకీలు దగ్గర మెటల్స్ ఉన్నవారు ఈ టెక్నాలజీ ద్వారా మెరుగైన ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.

## అబ్బో.. ఆ యువ నాయకుడితో ఎట్టా ఏగేది?

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తనయుడి శైలిపై మదనపడుతున్న నేతలు



**సాక్షి నెట్‌వర్క్:** సత్యవేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తనయుడు వ్యవహార శైలిపై ఆ పార్టీ నేతలే లోలోన మదనపడుతున్నారు. గత ఐదేళ్ల అధికార పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న ఆదిమూలం ఇటీవల ప్రతిపక్ష టీడీపీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. అయితే ఆయన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధినాయకుడు ప్రకటించిన సమయంలో నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఆయన నాయకత్వంపై పెద్దఎత్తున నిరసనలు వెల్లువెత్తాయి. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే తనయుడు సుమన్‌కుమార్ వ్యవహార శైలిపై అనేక అవమానాలు, భంగపాటుకు గురయ్యారు. ఆయనకు ముడుపులు ముట్టజెప్పితే గానీ పనులు జరగవని ముద్ర వేసుకున్నాడు. కనీసం ఏదైనా పని మీద గానీ, ఉద్యోగుల పోస్టింగుల విషయంలో తండ్రిని కలవాలంటే ముందుగా యువ నాయకుడికి ముడుపులు ముట్టజెప్పాల్సిందే. లేని పక్షంలో ఎమ్మెల్యేను కలవలేరు. పైగా కలిసిన సమయంలో యువ నాయకుడి కంటపడితే ఆ పని మీద వచ్చిన నేతకు గానీ, అధికారికి గానీ పిడిగుద్దులు తప్పవు. ఇంతటి ఘనకార్యాలు, అనుభవాలు అధికార పార్టీ నేతల నుంచి ఆ నోటా ఈ నోటా విన్నా ప్రతిపక్ష టీడీపీ నేతలు ఇప్పుడు భంగపడుతున్నారు.

**ముడుపులు ముట్టజెప్పేవారికే ఎమ్మెల్యే ఇంటి అనుగ్రహం**

ఎమ్మెల్యేగా గెలుపొందితే ఆ ఐదేళ్లు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నేతలు, అధికారులు తమతమ సమస్యలపై ఎమ్మెల్యే ఇంటికి వెళ్లడం పరిపాటే. అయితే ఈ విషయంలో సత్యవేడు సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం తీరు అందుకు విభిన్నం. కేవలం ముడుపులు ముట్టజెప్పేవారికి మాత్రమే ఎమ్మెల్యే ఇంటి గడప తొక్కేందుకు అర్హులు. సమస్యలపై వెళ్లే సామాన్య జనం ఎమ్మెల్యే ఇంటి దరిదాపుల్లో కనిపిస్తే ఎమ్మెల్యే తనయుడైన యువ నాయకుడికి చిరాకు. వారిని దురుసుగా మాట్లాడడం, అవసరమైతే చేయి చేసుకోవడానికి వెనుకాడడు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన పలువురు నాయకులు, సామాన్య ప్రజలు యువ నాయకుడి నుంచి ఇలాంటి చేదు అనుభవాలను అనేక సందర్భాల్లో చవిచూసినవారే. బహుశా రాష్ట్రంలోనే నియోజకవర్గ ప్రజలను ఇంటికి రానివ్వని ఎమ్మెల్యే ఎవరైనా ఉన్నారంటే ఆ ఘనత ఆదిమూలంకే దక్కుతుంది.